## ▼ ఈ వారం కథ

# దేవుడి బొమ్మ

-జయరావ్

నారాయణ ఇంట ప్రాకారపు గోడమీద వినాయకుడు వెలిసేడు.

మెయిన్ గేటుకి పక్కనూ అడ్డ రోడ్డుకి ఎదరగా వుండే ఎత్తయిన ప్రాకారపు గోడ మధ్యలోనూ చిన్న గూడులా కట్టి ఓ వినాయకుడి బొమ్మ ప్రతిష్ఠించడం, అందులో ఓ జీరో బల్బు వెలిగించడం నగరంలో నలుమూలలా కనబడే దృశ్యమే తప్ప అందులో వింతగా చెప్పుకోవల్సిందేమీ లేదు. కొండకచో అలాంటి చోట చిన్న సైజు దేవాలయం అవతరించి ఉభయ సంధ్యలా టంచన్‌గా ఓ పూజారి సకలోపచారాలూ జరిపిస్తూ యథాశక్తి భక్తుల్ని ఆకర్షించడం కూడా కద్దు.



దారినపోయే దానయ్యలు, మరీ ఆధునికులైతే, అక్కడి కొచ్చీసరికి అప్రయత్నంగానే కనురెప్పలు సగం మూసి కుడి చేతి మునివేళ్ళతో సుతారంగా గెడ్డానికి రెండు వేపులా తాటించి, ప్రకిస్టియన్లు క్రాసు వేసుకున్నట్టు ఓసారి నొసలు ఆ వెంటనే గుండెలూ తాకి చూసుకుని మరీ అక్కణ్ణుంచి కదలడం అలవాటుగా దర్శనమిచ్చే సాధారణ దృశ్యమే.

కొంచెం వయసు మళ్లిన వారూ కొంత సాంప్రదాయకులూ అయితే ఆ భక్తి ప్రదర్శన మరి కొంత పెద్ద మోతాదులో కొట్టవచ్చినట్టు కనపడనూ వచ్చు. క్షణకాలం నడకఆపి పట్టుకున్న బరువుల్తో సహా చేతుల్ని ఛాతీ మీదికి తెచ్చి విగ్రహం దిక్కుగా కన్నులు మోడ్చి ఒకటో అరో గుంజీలుతీసి. గాని ముందుకు కదలరు. అయితే ఇదంతా నడిచేప్పుడు అడుగు తీసి అడుగు వేసినట్టు అతి సాదాగా అలవాటు ప్రకారం జరిగిపోతుంది.

ఇంతకీ ఇప్పుడు చెప్పొచ్చీది, సాదాసీదాగా దినచర్యలో భాగంగా మామూలు నగర వాతావరణంలో సహజమైన తుంపుగా కలగలిసిపోయి ప్రత్యేకించి పరిశీలిస్తే తప్ప కంట పడని ఈ ఆచారం గురించి కానేకాదు.

నారాయణ ఇంటి కాంపౌండు గోడ మూల ములుపు మీద కొత్తగా పిళ్లయారు వెలియడం ఈ మామూలు ఆచారంలో భాగమైనట్టు గాక ఏదో వింతగా కనిపించింది కృష్ణమూర్తి గారికి.

అందుక్కారణంలేకపోలేదు. నారాయణ నాస్తికుడు.

నేను నాస్తికుణ్ణంటూ నారాయణ పని గట్టుకు ఎన్నడూ ప్రకటించుకున్నది లేదు. నారాయణ భార్య పూజలు పునస్కారాలూ, వుపాసాలు, వ్రతాలూ, నోములూ చేస్తూనే వుంటుంది. పేరంటాలకి వెళ్ళి తాంబూలాలూ జాకెట్టు బట్టలూ తెచ్చుకుంటూనే వుంటుంది. నారాయణ ప్రసాదాలూ అదీ మెక్కుతూనే వుంటాడు. బంధు మిత్రులు యాత్రలకి వెళ్లి వచ్చినా పూజలు చేయించినా "మరి, మా కేదీ ప్రసాదం" అని దబాయించి అడుగుతాడు కూడాను.

అయినా నారాయణకి బొత్తిగా భక్తి లేదన్నారు అందరూ.

అతడికి ఓసారి టైఫాయిడ్ వచ్చింది. "దేవుడి గురించి అడ్డగోలుగా మాటాడకురా నాయనా, మనసులో అయినా ఓసారి దణ్ణం పెట్టుకో" అని వాళ్ల బామ్మ మెత్తగా చీవాట్లేసి మొహాన ఇంత వీభూది కూడా పెట్టింది. "ఒత్తిగిల్లినప్పుడు తలగడాకి రాసుకుపోయింది లేవే" అని నీరసంగా నవ్వేసేడు నారాయణ. "అయినా నాకు మందిస్తున్న డాక్టరు గారికి బోలెడు భక్తి వుంది. దేవుడాయన్ని మోసం చెయ్యడ్లే" అని కూడా బామ్మని ఓదార్చేడు.

మరోసారి కంపెనీ లాకౌట్‌లో పడి ఉద్యోగానికే ముప్పొచ్చింది. "కొండ కొస్తావని మొక్కుకోండయ్యా అంతా సవ్యంగా జరుగుతం'దని అత్తగారు సాహసించి సలహా చెప్పింది. "మా వర్కర్సు చాలా మందివి, ఆ కంపెనీ పూర్తిగా మూసేసి మాకు రావలసిందేదో పారేస్తే ఇంత కంటె బాగా బతకొచ్చని అనుకుంటున్నావండీ. అంచేత ఏవవి మొక్కుకోవాలో ఇంకా తేలి చావలేదు" అని నవ్వేసేడు.

అందుకే నారాయణకి దైవ భీతి లేదనీ అసలు

దేవుడున్నాడనే నమ్మకవే లేదనీ ప్రసాదం వుప్పుగోడం టిఫిన్ తిన్నట్టు తింటాడనీ దేవుడి గురించి కూడా భూమ్మీద మనుషులు గురించి వేళాకోళవాడినట్టు నవ్వుతాలుగా మాటాడ తాడనీ (అయినా ప్రసాదవంటూ తింటున్నాడు గనక ఇంకా వాడి కళ్లు పోలేదనీ) ఇలా నారాయణ బంధు వర్గంలోనూ, మిత్రవర్గంలోనూ అతగాడి గురించి చాలా చాలా ప్రథలు ప్రచారంలోకి వచ్చి నారాయణ నాస్తికుడనే మాట 'పదుగురాడు మాట పాటియై' అని స్థిరపడిపోయింది.

ఆ ప్రచారంలో నారాయణ భార్య పున్నమ్మ గారు బాగా అందె వేసిన చెయ్యి. "మా వారికి నమ్మకాల్లేవు కదా" అనే కీర్తన రోజుకోసారైనా ఆవిడ నోటి నుండి వినని వాళ్లు అరుదు. అలా డిక్లేర్ చెయ్యడంలో ఆవిడేమైనా కించిత్తు కీర్తి గర్వం అనుభవిస్తుందేమో పరిశోధన జరప వలసిందే.

పై వాళ్లెవరో ఆ ప్రచారాలు నమ్మేరంటే అదో తీరు. నారాయణ పిల్లలు కూడా ఈ ప్రచారాన్ని ఇన్‌స్టింక్టివ్‌గా సొమ్ము చేసుకోవడమే విశేషం. నాన్న అరాచకం అనాచారం గురించి, "అమ్మా, నాన్న ప్రసాదం కళ్ళకద్దుకోలేదే"అనో "అమ్మా! నాన్నగారు లచ్మీదేవి ఫోటోకి కాలు తగిలించేరే" అనో పిల్లలు ఫిర్యాదులు చెయ్యడం, ఆవిడ మెటికలు విరవడం ఆ కుటుంబంలో అతిథులకి ఓ ఉచిత వినోదం.

తండ్రి చనిపోయినప్పుడు నారాయణ బజార్నించి జంజంకొని తగిలించుకున్నాడు. "మీ కంతే కావాలి" అన్నట్టు పున్నమ్మ గారు మూతి మూడు వంపులు తిప్పింది. (తండ్రి పోవడం కాదు; జంజం వేసుకోవడం). గుండు గొరి గించుకున్నాడు కూడా. "ఈ బోడిగుండును పక్కనెట్టుకుని నేను బస్సులెక్కాలి ఇహ" అని పున్నమ్మగారు రహస్యంగా కించిత్తు నొచ్చుకున్నారు కూడాను.

ఏతా వాతా చెప్పొచ్చేదేవంటే ఆయన బంధు వర్గంలోనే గాక కాస్మోపోలిటన్ మిత్రవర్గంలో కూడా నారాయణ నాస్తికత్వం గురించి అందరికీ నిస్సందేహంగా నమ్మకం ఏర్పడిపోయింది. ఆ కీర్తిని నారాయణ సుందర మందస్మితంతో అందుకుని అనుభవిస్తున్నాడు.

అలా ప్రసిద్ధి చెందిన నారాయణ ఇప్పుడు పబ్లిక్‌గా లోకవందరికీ బొట్టు పెట్టి చెప్పినట్టు ఏకంగా కాంపౌండ్ గోడకే ప్రత్యేకంగా గూడు కట్టించి వినాయకుణ్ణి కూచో బెట్టి దీపం వెలిగించి ముందు ముగ్గులు కూడా పెట్టించేస్తే అతన్ని ఎరిగున్న వాళ్లకి ఆశ్చర్యం కాక మరేవిటి?!

## రుద్రాక్షలు

శివుని కళ్ళు రుద్రాక్షలు. ఆ రుద్రాక్షల్ని నీళ్ళలో నానవేసి ఆ నీళ్ళు ప్రొద్దున్నే తాగుతే ఆరోగ్యానికి చాలా మంచిది. జపం చేసి నప్పుడు రుద్రాక్ష మాలలోని కొలికి పూస దాటరాదు. రెండు నెలలకోసారి రుద్రాక్షలను నువ్వుల నూనెలో ముంచి శుభ్రంగా తుడిస్తే అవి గట్టిగా పగిలిపోకుండా పది కాలాల పాటు వుంటాయి. రుద్రాక్షలు పవిత్రమైనవి కాబట్టి కటిక నేల మీద పెట్టకండి.

—ఎం.ఎస్.ఎం.

గృహ ప్రవేశం నాడు రిసెప్షన్‌కి బోల్డు డబ్బు తగలేశాడు తప్ప విఘ్నేశ్వర పూజ చేయనని మొండికేసిన బాపతు ఇప్పుడింతకి దిగేడంటే నిజంగా వాడిలో ఏదో పెద్ద మార్పే వచ్చి వుండాలి.

అదే మాట అనీసేడు కృష్ణమూర్తిగారు ఆ దంపతుల్తో; మంచి రోజులు వొచ్చినందుకు మన సారా అభినందిస్తున్నంత సంబరంగా.

"నిజవే అన్నయ్యగారూ. మనం ఎంత మొత్తుకున్నా వినిపించుకున్నారూ! చివరకి ఆ భగవంతుడే ఆయనకి తోపించేడు. రోజూ ఇంటి ముందు ఇంత ముగ్గుకర్ర పడుతూంది" అంటూ విక వికా నవ్వింది పున్నమ్మగారు.

ఆ నవ్వులో ఏదో వెటకారం జీర వినిపించి గతుక్కుమన్నాడు క్రిష్ణమూర్తిగారు.

అయినా మళ్ళీ తన ధోరణిలోనే మరింత ధీమాగా, "అంతేనయ్యా, నేన్చెప్పలేదూ. ఎంత విర్ర వీగినా చివరికి ఏదో ఓనాడు దాసోహం అనక తప్పదు. ఊరందరిదీ ఓదారయితే వులిపి కట్టె దొక దారి అంటే ఎలా కుదురుతుంది?" అంటూ రెట్టించేడు.

"బాగా చెప్పేరు. నిజమే మరి. ఊరందరిదీ అదే బుద్ధయినప్పుడు ఆ దార్లోనే అడ్డుకోవాలి మనమూను. మరో గతి లేదు మనకి" అన్నాడు నారాయణ. ఓటమి ఒప్పుకోలేక గింజు కుంటు న్నట్లు వినిపించింది కృష్ణమూర్తిగారికి.

"అదుగో మళ్ళీ ఆ గీర్వాణం దేనికి? కింద పడ్డా మీదే వున్నానంటావ్. ఇంతకీ ఏం జరి గింది? స్వామి కల్లో కొచ్చేరా?" అంటూ కుతూ హలాన్ని మిళాయించి ఓ పోటు పొడిచాడు.

"ఆఁఆఁ ఆ స్వామి కంత సాహసం లేదు గాని, జనవందరికీ ఆ బొమ్మంటే భయవేనని నేనే పాత నిజాన్నే మరోసారి లేటుగా గ్రహించేను. అసలు కథేవిటంటే..." అంటూ చిరునవ్వుతో వివరణకి ఎత్తుకున్నాడు నారాయణ.

"మా ఇంటి కవతల పాచి హోటలొకటి వెలిసింది చూసేరు కదా. అదే నంది ప్రొచీ. పెద్ద పెద్ద హోటళ్లకి దేవ భాషలో అయోమయం పేర్లు పెట్టడం అదొక ఫైవ్ స్టార్ ఫేషనై పోయిందిలెండి. వాళ్లొక పెర్మిట్ రూం కూడా పెట్టేరు. దాంతో వాళ్లకి బేరాల జోరు పెరిగి మాకు ముక్కులు బద్దలవడం మొదలైంది."

"ఏవీ? ఆ తాగిన వాళ్లంతా తా్రోడ్డు మీదే కక్కుకుంటున్నారా యేవిటి ఖర్మ! అంత పెద్ద హోటల్లో బాతురూములు పెట్టించుకోరూ అగాయిత్యం గానీ"

"ఏం చచ్చేరో! శాంతి నికేతన్‌లా వుండీ మా రోడ్డు కాస్తా ఈ హోటల్లేవడంతో పరమ బిజీ సెంటరైపోయింది. తా రందరూ వొచ్చి ఎదు రుగా మాగోడకి దాపెట్టి వుచ్చలు పొయ్యడం మొదలెట్టేరు. అప్పటికీ మా ఆవిడా పిల్లలూ కిటికీల్లోంచి తిట్ల బాణాలు సంధిస్తూనే వుంటారు. అయినా ఎంతకని కాపలా కాయ గలం? ఇహ ఇది కాదన్చెప్పి "ఇచ్చట వుచ్చలు పోయరాదు" అని కాస్త పెద్ద పెద్ద అక్షరాల్తోనే బోర్డు రాయించి రాత్తిరిపూట కనపడదని ఓ బల్బు కూడా వేలాడదీయించేను. ఆ బల్బు పగలగొట్టేరు తప్ప వుచ్చలు పొయ్యడం మాన్లేదు. చివరకి ఈ అయిడియా తట్టి మన వినాయకుణ్ణి తీసుకొచ్చి కాపలా పెట్టేసేను. కార్పొరేషను వల్లా, గవర్నమెంటు వల్లా సాధ్యం కాని పని ఈ పొట్టాయన వల్ల ఇలా సానుకూలవైంది. ఎలా గైతేనేం మేం తరించాం" అని ముగించి ఇప్పుడే వంటారన్నట్టు చూసేడు నారాయణ.

"భక్తన్నది నీకు చచ్చినా అర్థం కాదు గాని, వినాయకుణ్ణి పట్టుకుని కాపలా వాడనడం మాత్రం నీ పెటకొ్రుతనమే సుమా" అన్నారు క్రిష్ణమూర్తి కథకి ఇదే భరతవాక్యం అన్నట్టు.

"అయ్యయ్యో! ఆయన అవతారవే కాపలా మనిషిగా అని కదా మన పురాణాలు ఘోషించేది. వాళ్లమ్మ స్నానానికి పోతూ ఎవళూ రాకుండా చూడమని కదా ఈ బొమ్మకి ప్రాణం పోసింది. మన పురాణాల్నే కాదంటే ఎలా స్వామీ?" అని నారాయణ అంటుంటే

"చాల్లెండి సంబడం. మన పాండిత్యానికి పురాణాలొక్కటే తక్కువ" అంటూ హైకమాండు వారు కాఫీ కప్పుల్తో ప్రత్యక్షవయేరు.